# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట




## అక్రమ నిర్మానాలకు వేదికగా కొత్తపల్లి



**ప్రజాపక్షం/కాటారం:** మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయితీ పరిధిలో అక్రమ నిర్మాణాలు విస్తరిస్తున్నా అడ్డుకోవాల్సిన అధికారులు చూస్తూ మౌనం పాటిస్తున్నారని మండల వ్యాప్తంగా ఆరోపనలు వెల్లువెత్తుతున్నాయి.అనుమతులు లేకుండా నిర్మాణాలు బహిరంగాంగా సాగుతున్నప్పటికీ ఎలాంటి అనుమతుతు కపోవడం,చర్యలు తీసుకోకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.గ్రామంలో ఎక్కడ చూసినా కొత్తగా ఇళ్లు ,వ్యాపారా దుకాణ నిర్మాణాలు కనిపిస్తున్నా పంచాయితీ అనుమతులుభవన నిబందనలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని స్థానికుల్లో చర్చలు సాగుతున్నాయి.ముఖ్యంగా ప్రధాన రహదారికి దగ్గరగా,ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాఅధికారుల మౌనం వెనుక ఆంతర్యమేమిలో అని ప్రజల్లో అనేక రకాల అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.ఇదిలా ఉంటే పేద ప్రజలు ఎలాంటి నిర్మాణం చేపట్టినా ఆఘమేఘాల మీద వాలిపోయి ఇబ్బందుల పెట్టే అదికారులు అక్రమ నిర్మానాలను అడ్డుకోవడంలో విఫలమౌతున్నారని అరోపనలు వ్యక్తమౌతున్నాయి.తక్షణమే అధికారుల స్పందించి అక్రమ నిర్మాణాలపై సమగ్ర తనిఖీ చేపట్టి అనుమతులు లేని నిర్మాణాలను నిలిపివేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# వేయి స్తంభాల దేవాలయం అభివృద్ధికి కృషి

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎంపి కడియంకావ్య




**ప్రజాపక్షం/హనుమకొండ:** చారిత్రక ప్రాధాన్యం గల రుద్రేశ్వర స్వామి వేయి స్తంభాల దేవాలయం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు సాధిస్తామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు.మంగళవారం వేయి స్తంభాల దేవాలయాన్ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్యతో సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ ఈవో అనిల్ కుమార్, ప్రధాన అర్చకులు ఉపేంద్ర శర్మ స్వామివారి తీర్థప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు.ఇటీవల కేంద్ర టూరిజం, పురావస్తు శాఖ నుంచి విడుదలైన రూ.14.14 కోట్ల నిధుల వినియోగంపై అధికారులు వివరాలు అందించారు. ఈ నిధులతో ఆలయంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, సెంట్రల్ లైటింగ్, గార్డెన్ అభివృద్ధి, కోనేరు పునరుద్ధరణ, భక్తులకు సౌకర్యాల కల్పన వంటి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే నందీశ్వర మండపం ప్రాంతంలో అభివృద్ధి పనులు కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు.ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో ఈ దేవాలయానికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. ప్రస్తుతం కేంద్రం నుంచి నిధులు విడుదల కావడం సంతోషకరమని, ఈ నిధులను పారదర్శకంగా వినియోగించి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు అందరం ఎంపీ కడియం కావ్య నాయకత్వంలో ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి జిల్లాలో ఉన్న చారిత్రక ఆలయాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని,అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరడం జరిగిందని అన్నారు.ఆలయ అభివృద్ధికి నిధులు విడుదల పట్ల బీజేపీ పార్టీ నేతలు తామే స్వయంగా తీసుకొచ్చమని అనడం హాస్యాస్పదం అని అన్నారు.గడిచిన పదేళ్ల కాలంలో రాష్ట్రంలో బీఆర్ఎస్,కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కలిసి పనిచేసనప్పుడు నిధులు ఎందుకు తీసుకురాలేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి టాక్స్ ల రూపంలో రూపాయి ఇస్తే తిరిగి కేవలం 30 పైసలు మాత్రమే ఇస్తున్నదని అన్నారు.10 ఏళ్ల కాలంలో ఒక్కరోజైనా అభివృద్ధి కోసం ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి నిధులు మంజూరు చేయాలని అడిగిన దాఖలాలు లేవని విమర్శించారు.ఎంపీ కావ్య నేతృత్వంలో పలుమార్లు ఢిల్లీలో మంత్రులు కలుస్తూ రావాల్సిన నిధుల పట్ల సమిష్టి కృషి చేశామని అన్నారు.అదేవిధంగా దేవాలయం ముందు భాగ సుందరీకరణ కోసం రూ.30 కోట్ల నిధులు కేటాయించగా, అందులో ఇప్పటికే కొంత పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. భవిష్యత్తులో యునెస్కో గుర్తింపు పొందేలా ఆలయాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు.దేవాలయం పరిసర ప్రాంత అభివృద్ధి కోసం స్థానిక గృహ యజమానులు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ వివాదం నేపథ్యంలో దొంగతనం

### గడ్డివాము దహనం రూ.7లక్షల నగదు దోపిడి




**ప్రజాపక్షం/గూడూరు:** ప్రేమ వివాదం ఉద్రిక్తతకు దారి తీసి దొంగతనం మరియు అగ్నిప్రమాదానికి కారణమైన ఘటన మంగళవారం గూడూరు మండలం గుండెంగా లో వెలుగులోకి వచ్చింది గ్రామానికి చెందిన తేజవత్ ఉమ్లా తండ్రి మంజ్య కుటుంబం ఈ సంఘటనతో తీవ్రంగా నష్టపోయింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏప్రిల్ 6 న ఉదయం ఉమ్లా ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనుల కోసం వెళ్లిన సమయంలో కొంతమంది వ్యక్తులు ఇంటి ముందు చురుకుని ప్రేమ వ్యవహారంపై నిరసన వ్యక్తం చేశారు. దీని తరువాత మంగళవారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి వద్ద ఉన్న గడ్డివాముకు నిప్పు పెట్టి దగ్ధం చేశారు.

అనంతరం ఇంటి తాళం పటలగొట్టి లోపలికి చొరబడి బీరువాలో ఉన్న సుమారు రూ.7 లక్షల నగదు బంగారు గొలుసును అపహరించారు.ఈ అగ్ని ప్రమాదంలో గడ్డివాము పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.10 వేల మేర నష్టం జరిగినట్లు సమాచారం బాధితుడు తేజవత్ ఉమ్లా ఫిర్యాదు మేరకు గూడూరు పోలీస స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ గిరిధర్ రెడ్డి తెలిపారు.నిందితులను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగినట్లు ఆయన వెల్లడించారు.

## మహనీయుల జయంతి ఉత్సవాలను
# విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/జనగామ:** మహనీయులు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, జ్యోతిరావుపూలే జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని జయంతి ఉత్సవాల కమిటి నాయకులు కోరారు. మంగళవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హనుమాన్ల ఘాన్సీరెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవాలకు రావాలని కోరారు. ఈ సందర్భంగా ఉత్సవాల కమిటి అధ్యక్షులు గద్దల కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 14న జరిగే అంబేద్కర్ జయంతి సందర్భంగా 13న సాయంత్రం జ్ఞానయాత్ర నిర్వయించడం జరుగుతుందన్నారు. జ్ఞాన యాత్రకు పెద్ద సంఖ్యలో అంబేద్కరిస్టులు తరలిరావాలన్నారు. అంబేద్కర్ జ్ఞానయాత్ర ద్వారా అందరికి ఆయన విజ్ఞానాన్ని గుర్తు చేయాలనే ఉద్దేశ్యంతోనే ఈ యాత్ర చేపట్టడం జరుగుతుందన్నారు. 13న సాయంత్రం రైల్వే స్టేషన్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ఈ యాత్ర జరుగుతుందన్నారు. ఈ జ్ఞాన యాత్రకు జనగామ జిల్లా వ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్సవాల కమిటి గౌరవాధ్యక్షులు బొట్ల శేఖర్, మేడ శ్రీనివాస్, పార్నంది వెంకటస్వామి, గిరిమల్లె రాజు, రాగళ్ల ఉపేందర్, జేరిపోతుల పరుశరామ్, జేరిపోతుల కుమార్, మల్లిగారి రాజు, తిప్పారపు విజయ్, ఇనుముల నర్సయ్య, ఉడుగుల కిష్టయ్య, పానుగంటి సువార్త, గజవెల్లి ప్రతాప్, జేరిపోతుల ఉపేందర్, బొట్ల వెంకటేష్, ఇరుగు సిద్దులు, గువ్వల రవి, పైసా రాజశేఖర్, సందెన రవీందర్, గంగరబోయిన మౌనిక, దామెరల లావణ్య, సుద్దాల కుమారస్వామి పాల్గొన్నారు.



## డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన అశోక్ కుమార్‌కు ఘన సన్మానం

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** అతి చిన్న వయసులోనే స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్(డీ డీ)గా పదోన్నతి పొందిన గుగులోతు అశోక్ కుమార్ ను ఈ సందర్భంగా కోచ్‌లు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. హనుమకొండ జిల్లా యువజన క్రీడాభివృద్ధి అధికారి పనిచేస్తున్న అశోక్ కుమార్ సాధించిన ఈ అరుదైన విజయాన్ని ప్రశంసిస్తూ పుష్పగుచ్ఛాలు అందించి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కృషి, పట్టుదల, అంకితభావంతో ఉన్నత స్థానాన్ని అందుకోవచ్చని అశోక్ కుమార్ సార్ నిరూపించారని కొనియాడారు.యువ వయసులోనే ఈ స్థాయికి చేరుకోవడం ఎంతో గర్వకారణమని, స్పోర్ట్స్ రంగంలో ఆయన నాయకత్వం మరింత అభివృద్ధికి దోహదపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. యువత తమ లక్ష్యాల కోసం కష్టపడి ముందుకు సాగాలని ఆయన ప్రయాణం ఒక స్పష్టమైన సందేశమని పేర్కొన్నారు. ఈ సత్కార కార్యక్రమంలో పలువురు కోచ్‌లు, సిబ్బంది పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## గూడూరుకు నియోజకవర్గ హోదా ఇవ్వాలి




**ప్రజాపక్షం/గూడూరు:** గూడూరు మండల కేంద్రాన్ని నూతన నియోజకవర్గ ంగా ప్రకటించాలని డీఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ నిర్వహించిన కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి బానోత్ దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు మండలంలో అధిక సంఖ్యలో ఆదివాసీ గిరిజన గిరిజనేతర ప్రజలు నివసిస్తూరని తెలిపారు. స్వాంతంత్రం అనంతరం రాజ్యాంగబద్ధంగా గూడూరు ప్రాంతాన్ని షెడ్యూల్డ్ ఏరియాగా గుర్తించి గిరిజన చట్టాలను అమలు చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు.మండల పరిధిలోని 41 గ్రామపంచాయతీలలో సేమారు 70 వేల మంది ప్రజలు నివసిస్తూన్నారని అందులో 70 శాతం ఆదివాసీ గిరిజనులు 30 శాతం గిరిజనేతరులు ఉన్నారని వివరించారు. గూడూరు మండల కేంద్రం మహబూబాబాద్ నియోజకవర్గానికి సుమారు 30 కిలోమీటర్లు నర్సంపేట నియోజకవర్గానికి 20 కిలోమీటర్లు దూరంలో ఉండటంతో ప్రజలకు పరిపాలనా ఇబ్బందులు ఎదురవుతన్నాయని పేర్కొన్నారు. చరిత్రపరంగా గూడూరు 1909 నుంచే తాలుకా కేంద్రంగా సమిత్రిగా ఉండి పరిపాలనా కేంద్రంగా సేవలందించిందని తెలిపారు.ప్రస్తుతం కూడా గూడూరులో పోలీస్ సర్కిల్ కార్యాలయం ఎక్సైజ్ ప్రోహిబిషన్ కార్యాలయం అటవీశాఖ సబ్ డివిజన్ సామాజిక ఆరోగ్య కేంద్రం పంచాయతీ రాజ్ అర్‌బి ఆర్‌డబ్ల్యుస్ డివిజనల్ కార్యాలయాలు వంటి కీలక ప్రభుత్వ సంస్థలు అందుబాటులో ఉన్నాయని చేప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డీలిమిటేషన్ ప్రక్రియను ప్రారంభించిన ఈ సమయంలో గూడూరు మండలాన్ని నియోజకవర్గంగా ఏర్పాటు చేయడం సముచితమని అభిప్రాయపడ్డారు.ఈ డిమాండ్ సాధన కోసం ప్రజా విద్యార్థి ఉద్యమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి గూడూరును నియోజకవర్గ హోదా కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో సుమన్ శ్రీకాంత్ అంజన్న వాసు బాలాజీ వెంకటేశ్ వీరన్న చరణ్ మోహన్ ఈశ్వర్ తదితరలు పాల్గోన్నారు.

## ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలను ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/హనుమకొండ:** హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మంగళవారం హన్మకొండలోని ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలను ఆకస్మికంగా సందర్శించి, ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను సమగ్రంగా పరిశీలించారు.మొదటగా ఓపీ కౌంటర్ల వద్ద సేవల పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్, రిజిస్టర్ల నిర్వహణపై సమీక్ష చేశారు. అనంతరం ఫార్మసీని తనిఖీ చేసి, ఔషధాల నిల్వలు, పంపిణీ విధానాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా లేబర్ రూమ్, వార్డులు మరియు ఇతర విభాగాలను సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. కొన్ని వార్డుల్లో స్వల్పంగా శుభ్రత లోపం గమనించిన కలెక్టర్, వెంటనే శుభ్రత ప్రమాణాలను మెరుగుపరచాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు.వైద్య సేవల అమలు విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్న కలెక్టర్, రోగులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారికి అందుతున్న సేవలపై అభిప్రాయాలను సేకరించారు. వైద్య సిబ్బంది విధులకు సమయానికి హాజరు కావడంతో పాటు, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.ఆసుపత్రి క్యాంటీన్‌ను కూడా పరిశీలించిన కలెక్టర్, ఆహార పదార్థాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా వంట నూనెను పునర్వినియోగం చేయవద్దని హెచ్చరించారు.మొత్తం ఆసుపత్రి నిర్వహణను మరింత సమర్థవంతంగా, శుభ్రతతో నిర్వహిస్తూ, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, ఆర్ఎంఓ డాక్టర్ మంజుల, డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## స్మిత్సోనియన్ ఫోటోగ్రఫీ పోటీలో అరుణ్ అద్భుత ప్రతిభ





**ప్రజాపక్షం/భూపాలపల్లి:** ప్రతిష్టాత్మకమైన స్మిత్సోనియన్ మ్యాగజైన్ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీలో భారతదేశం తరపున తెలంగాణలోని భూపాలపల్లికి చెందిన ఫోటోగ్రాఫర్ అరుణ్ నలిమెల తీసిన ఫోటో ఎంపికైంది. తన అద్భుతమైన ప్రతిభతో అరుణ్ అంతర్జాతీయ వేదికపై తెలుగు రాష్ట్రాల ఖ్యాతిని చాటారు. తద్వారా అరుణ్ ఫోటోగ్రఫీ ప్రతిభకు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభించింది. వారణాసిలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు వెలిగించిన ప్రమిదల మధ్య ఒక మహిళ నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాన్ని అరుణ్ తన కెమెరాలో బంధించారు. సిటీ ఆఫ్ లైట్స్ అనే శీర్షికతో అరుణ్ క్లిక్ చేసిన ఈ ఫోటో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన వేలాది ఎంట్రీల మధ్య ప్రత్యేకంగా నిలిచింది. ఈ ఫోటో గురించి అరుణ్ మాట్లాడుతూ, మనం పూర్తి భక్తితో సంస్కృతిని చిత్రీకరించినప్పుడు, కొన్ని అద్భుతమైన చిత్రాలు దానంతట అవే మనకు లభిస్తాయి. ఈ ఫోటో కూడా అలా దేవుడు ఇచ్చిన కానుక లాంటిదే అని అరుణ్ పేర్కొన్నారు.

**సోదరుడి స్పూర్తితో మొదలైన ప్రయాణం**

తెలంగాణకు చెందిన 33 ఏళ్ల అరుణ్, 2013లో తన అన్నయ్య స్పూర్తితో ఫోటోగ్రఫీని హాబీగా మొదలుపెట్టారు. మొదట్లో వన్యప్రాణుల ఫోటోలు తీసే అరుణ్, ఆ తర్వాత తన దృష్టిని భారతీయ సంస్కృతి వైపు మళ్లించారు. గతంలో ప్రధాని నరేంద్ర మోదీ మన్ కి బాత్ కార్యక్రమంలో అరుణ్ ఫోటోగ్రఫీని అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన అరుణ్ ను పలువురు ఫోటోగ్రాఫర్లు అభినందించారు.

## ప్రజల్లో ఆరోగ్య స్పృహను పెంపొందించాలి



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఆరోగ్యం పట్ల స్పృహను పెంపొందించాలని, వైద్యంతో పాటుగా నైతిక మద్దతును వారికీ అందించాలని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. ఆర్. దిలీప్ కుమార్ నాయక్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చెల్పూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్.దిలీప్ కుమార్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిల్లో పని చేసే ఆశ వర్కర్లు, ఏఎన్ఎం లు, హెల్త్ అసిస్టెంట్ లు ఆరోగ్యం చెడిపోయిన వారికీ వైద్య సేవలను అందించడంతో పాటుగా, వారికీ నైతిక మద్దతును ప్రకటించాలని సూచించారు. మానసిక ధైర్యంతో రోగి యొక్క జబ్బు సగం నయం అవుతుందని పేర్కొన్నారు. ప్రజల్లో ఆరోగ్యం పట్ల అవగాహనా పెంచినప్పుడు, ఎవరికీ వారు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించినప్పుడు ఆరోగ్య భారతం నిర్మితం అవుతుందని జడ్జి హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్, సుధాకర్, అడ్వొకేట్స్ కూనూరు సురేష్ కుమార్, రాములు, శ్రీనివాస్, కంప అక్షయ, శ్రీదేవి, స్వాతి, న్యాయవాదులు మంగళంపల్లి రాజ్ కుమార్, రజిత పాల్గొన్నారు.

## విద్యా సేవలో అంకితభావం



**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో దీర్ఘకాలంగా సేవలందించిన సిద్దబోయిన దేవ దేవి విద్యా రంగంలో తన ప్రత్యేక ముద్ర వేసిన ఉపాధ్యాయురాలిగా నిలిచారు.సుమారు 30 ఏళ్లకు పైగా ఆమే చేసిన సేవలు కేవలం బోధనకే పరిమితం కాకుండా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం నైతిక విలువల పెంపకం క్రమశిక్షణలో మార్గనిర్దేశం చేయడంలో కీలకంగా నిలిచాయి. గిరిజన బాలికల విద్యాభివృద్ధికి ఆమే చేసిన కృషి విశేషంగా గుర్తించదగినది. ప్రత్యేకంగా పేద వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారి చదువుపై ఆసక్తి పెంచేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టారు.పాఠశాలలో హాజరు శాతం పెంచడం డ్రాప్‌ఔట్ రేటును తగ్గించడం వంటి అంశాల్లో ఆమే చేసిన కృషి ప్రశంసనీయం దేవ దేవి విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు జీవన విలువలు సామాజిక బాధ్యతలు దేశభక్తి వంటి అంశాలపై అవగాహన కల్పించారు.ఆమే బోధనలో సౌమ్యత క్రమశిక్షణ ప్రేమ కలగలిపి ఉండటం వల్ల విద్యార్థులు ఆమేను ఎంతో అభిమానించేవారు. అలాగే పాఠశాల అభివృద్ధి కోసం కూడా ఆమే చరుకుగా పనిచేసి సదుపాయాల మెరుగుదల శుభ్రత పర్యావరణ పరిరక్షణ వంటి కార్యక్రమాల్లో ముందుండి నాయకత్వం వహించారు.సహచర ఉపాధ్యాయులతో సమన్వయం పాటిస్తూ టీమ్ వర్క్‌కు ప్రాధాన్యం ఇచ్చి పాఠశాలను అభివృద్ధి దిశగా నడిపించారు.ఆమే సేవలు అనేకమందికి ఆదర్శంగా నిలుస్తాయని అధికారులు స్థానికులు ప్రశంసిస్తున్నారు ఉద్యోగ విరమణ అనంతరం కూడా ఆమే సమాజానికి మార్గదర్శకురాలిగా కొనసాగాలని అందరూ ఆశిస్తున్నారు

## బిజెపి కార్యకర్తలకు సైద్ధాంతిక శిక్షణ అవసరం

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** బిజెపి కార్యకర్తలకు సైద్ధాంతిక శిక్షణ అవసరమని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి భాగాల నవీన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బీజేపి మండల పండిట్ దీన ద యాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ కార్యక్రమాన్ని మం డల అధ్యక్షుడు బస్వ భాస్కర్ అధ్యక్షతన నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో బీజేపి విజయం కోసం వ్యూహరచన ఈ శిక్షణ తరగతుల ద్వారా బోధించడం జరు గుతుందన్నారు. ఈ శిక్షణ శిబిరంలో 8సెషన్స్‌లలో శిక్షకుల ద్వారా శిక్షణ ఇప్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కుమార్, రాజు, తిరుపతి నాయక్, అన్వేష్, జయ్, మహేందర్, సుధాకర్, ఉప్పల్‌రెడ్డి, కృష్ణ, సోమన్న, నాగరాజు, కొండయ్య, అనిల్, అశోక్, జగన్,పాల్గొన్నారు.

## గూడూరులో మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించాలి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండలంలోని గూడూరు గ్రామంలో మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రం వెంటనే ప్రారంభించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాచర్ల సారయ్య అన్నారు. మంగళవారం మండంలోని గూడూరు గ్రామం లో రైతు సంఘం, ప్రజా సంఘాల ఆద్వర్యంలో రైతులు రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఒక్కొక్క ఎకరానికి రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టారని ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలన్నా రు. ఇప్పటికైనా ఎమ్మెల్యే సంబంధిత అధికారులు స్పందించి గూడూరు గ్రామంలో కొనుగోలు కేంద్రం వెంటనే ఏర్పాటుచేసి మక్కలు కొనుగోలు చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్ రెడ్డి, సంపత్, సోమనాథం, చేరాలు, యాదయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

## అక్రమ పట్టాను రద్దు చేసి సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** మండల కేంద్రంలోని సర్వే నెంబన్ 192 లో ఉన్న దేవాదాయ భూమిపై అక్రమంగా జారీ చేసిన పట్టాదార్ పాస్‌పుస్తకాలను రద్దు చేసి, సంబంధిత వ్యక్తులపై, అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి సోమయ్య డిమాండ్ చేశారు. దేవాదాయ భూమి ని ఎండోమెంట్, ప్రభుత్వం అధీనంలోకి తీసుకోవాలని, ప్రైవేట్ వ్యక్తుల పైన పట్టేదార్ పాస్‌పుస్తకం రద్దు చేసి, అక్రమంగా పట్టా చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని మంగళవారం మం డల కేంద్రంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గుండెబోయిన రాజు, మండల కార్యదర్శి సభ్యులు కాట సుధాకర్,నాయకులు, ఉపసర్పంచ్ గంగరాజు, యాకయ్య, ఇక్బాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/బెజ్జంకి :** ఆర్థిక సమస్యలతో మనస్తాపానికి గురై పురుగుల మందు సేవించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృ తి చెందిన సంఘటన మండల పరిధిలోని దేవక్కపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది.పోలీసులు తెలిపి వివరాల మేరకు జనగాం పోచయ్య (47) ఆర్థిక,వ్యక్తిగత సమస్యలతో ఈ నెల 3న ఇంటిలో వ్యవసాయానికి ఉపయోగించే పురుగుల మం దు సేవించగా గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృ తి చెందాడు మృతుడి భార్య జనగాం లక్ష్మి పిర్యాధు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.సౌజన్య తెలిపారు.

## ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు

**ప్రజాపక్షం/తొర్రూరు :** ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు ప్రొద్దుటూరు గౌరీశంకర్ అన్నారు. మంగళవారం తొర్రూరు బస్టాండ్ సెంటర్‌లో పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్ ముందు శ్రీ వాసవి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మచ్చ సురేశ్, దేవస్థానం కమిటీ అధ్యక్షుడు చలువాది సత్యనారాయణతో కలిసి గౌరీశంకర్ చలివేంద్రంతో పాటు మజ్జిగను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగేశ్వర్‌రావు, బోనగిరి శంకర్, నాళ్ల కృష్ణమూర్తి, దారం కుమారస్వామి, వాసవి క్లబ్ మాజీ ప్రధాన కార్యదర్శి ఇమ్మడి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంజిఎం దవాఖానలో ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే నాయిని

ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : వరంగల్ ఎంజీఎం ప్రభుత్వ దవాఖానలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై స్వయంగా సమీక్ష చేపట్టి, పలు విభాగాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముందుగా జనరల్ ఓపీ విభాగాన్ని సందర్శించి, అక్కడ చికిత్స కోసం వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు, ఎదురవుతున్న సమస్యలు, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. రోగుల సమస్యలను ఓర్పుతో విన్న ఎమ్మెల్యే, సేవలలో ఎలాంటి లోపాలు ఉండకూడదని అధికారులను ఆదేశించారు.అనంతరం విధుల్లో ఉన్న వైద్యులతో సమావేశమై, ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సేవల నాణ్యతపై చర్చించారు. వైద్యులు ఎదుర్కొంటున్న సవాళ్లు, అవసరమైన సిబ్బంది, పరికరాలు, ఔషధాల లభ్యత వంటి అంశాలపై సమగ్రంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో సేవలను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందని సూచించారు.సూపరింటెండెంట్ ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో ఇటీవల ఆసుపత్రిలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా మెడిసిన్ విభాగంలో ఉన్న అలసత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, తక్షణమే సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన నిధులపై సమగ్ర ప్రణాళిక రూపొందించి వెంటనే ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు.పేద ప్రజలకు ఈ దవాఖాన ఒక కల్పవృక్షంలాంటిదని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రతి వైద్యుడు, సిబ్బంది అంకితభావంతో పనిచేసి రోగులకు ఉత్తమ సేవలు అందించాలని కోరారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన అంశంలో నిర్లక్ష్యం అసలు సహించబోమని హెచ్చరించారు.ఆసుపత్రిలో పారిశుద్ధ్యం, మందుల సరఫరా, వైద్య పరికరాల అందుబాటు, సిబ్బంది హాజరు వంటి అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సేవల నాణ్యతను మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సీనియారిటీ ప్రాతిపదికన ఎన్యూమరేటర్లను నియమించాలి

**ప్రజాపక్షం/మహాదేవపూర్:**మే నెలలో చేపట్టనున్న జనగణనకు సీనియారిటీ ప్రాతిపదికన సూపర్వైజర్, ఎన్యూమరేట్లను నియమించాలని కోరుతూ ఐక్య ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ సత్యనారాయణ స్వామిక వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనగణనకు సీనియారిటీని పరిగణలోకి తీసుకోకుండా నియమించారని ఆరోపించారు.సీనియారిటీతో పాటు క్లస్టర్ ప్రాతిపదికన కెటాయించాలని వినతిపత్రంలో కోరినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో డిటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు కొత్తపల్లి సారంగపాణి,దామరకుంట శ్రీకాంత్,పిఆర్టీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు గౌరవేణి రాజయ్య,అబ్బాడి దేవేవందర్,టిఆర్టిఎఫ్అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బండం రాజిరెడ్డి,చిడం కోటేశ్వర్,ఆర్‌యుపిపి అధ్యక్షుడు దారం రాజబాబు,పెటా జిల్లా అధ్యక్షుడు సిరంగి రమేష్,డిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మన తిరుపతి రెడ్డి,డిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బొక్కల ప్రభాకర్ రెడ్డి,డిటిహెచ్ జిల్లా కౌన్సిలర్ మడ్క మధు,మండల కార్యదర్శి తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కెజిబివిలో పరీక్షల భయం



**ప్రజాపక్షం/కమలాపూర్:**కమలాపూర్‌మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలోని విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సును ప్రభుత్వ వైద్య బృందం నిర్వహించారు. పరీక్షల భయం వద్దు... ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేద్దాం... అనే అంశం పై ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ప్రహసిత్ విద్యార్థినులకు దిశానిర్దేశం చేశారు. పరీక్షలు అంటే భయం కాదని, అది కేవలం ఒక ప్రక్రియ మాత్రమేనని డాక్టర్ ప్రహసిత్ అన్నారు. బత్తిడిని అధిగమించేందుకు సరైన ప్రణాళిక, క్రమశిక్షణతో కూడిన అధ్యయనం అవసరమని వివరించారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, సానుకూల దృక్పథంతో ఉంటే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని ఆయన సూచించారు. ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు అవసరమైన తగు సూచనలు, సలహాలు ఇచ్చి విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమలాపూర్ ప్రభుత్వ వైద్య అధికారి డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ... విద్యార్థినులు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, అప్పుడే ఏ రంగంలోనైనా విజయం సాధించగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ అర్చన, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## డిహెచ్‌పిఎస్ రెండో మహాసభల వాల్ పోస్టర్ విడుదల




ప్రజాపక్షం/ధర్మసాగర్ : డీహెచ్‌పీఎస్ రెండో మహాసభల వాల్ పోస్టర్ ను హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం పెద్ద పెండ్యాల గ్రామంలో రాజారపు దేవయ్య అధ్యక్షతన విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు రాజారపురత్నం హాజరై మాట్లాడుతూ ఏప్రిల్ 17,18 తేదీలలో అబ్బూస్ ఫంక్షన్ హాల్ పోచం మైదాన్ .వరంగల్ బహిరంగ సభను జయప్రదం చేయవలసిందిగా ఆయన పిలుపునిచ్చారు. 76 సంవత్సరాల స్వాతంత్ర్య పరిపాలనలో నేటికీ దళితులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారు సమానత్వం సామాజిక న్యాయం అభివృద్ధి కుల నిర్మూలన కాగితాలకు పరిమితమైందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దళిత బలహీన వర్గాల హక్కుల కొరకు అభివృద్ధికి రాజ్యాంగం ద్వారా కల్పించిన రిజర్వేషన్లను గత కొన్ని సంవత్సరాలుగా పాలకులు అనుసరిస్తున్న సరళీకరణ ఆర్థిక విధానాలు, ప్రైవేటీకరణ విధానాల వలన రోజురోజుకు ప్రభుత్వ రంగ పరిశ్రమలు స్థాపన లేక ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం మూలంగా ప్రభుత్వ కార్యాలయంలో ఉపాధి కల్పించు సంస్థలు లేక కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ విధానాలను ప్రవేశపెట్టడం వలన రిజర్వేషన్ల ఉనికి నామమాత్రంగా మిగులుచున్నదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోట నాగరాజు, కొత్తపెల్లి బిక్షపతి, రాజారపు సురేష్, జిట్ట కుమారస్వామి, కొత్తపెల్లి ఏలియా,బొడిగ కమలాకర్ ,రాజారపు శీను,సదానందం, హుస్సేన్, ప్రభాకర్, రాజు మొదలగు నాయకులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్‌కు సన్మానం



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీలో ఇటీవల స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా ఎంపికైన కందుల సంజీవరెడ్డిని సంఘం సభ్యులు హనుమకొండ రాంనగర్ లోని కార్యాలయం లో మంగళవారం ఘనంగా సన్మానించారు. కందుల సంజీవరెడ్డి గతంలో పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగిగా సేవలందిస్తూ 1990 నుండి 2020 వరకు ఉద్యోగ సంఘం నాయకుడిగా, రాష్ట్ర అధ్యక్షుడిగా విశేష సేవలు అందించారు. ఆయన నాయకత్వ పటిమను, అనుభవాన్ని గుర్తించిన టి.ఎస్.జి.ఆర్.ఇ.ఎ రాష్ట్ర కమిటీ ఆయనను రాష్ట్ర కమిటీ లో ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా నియమించింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నగరశాఖ అధ్యక్షులు మల్లారెడ్డి, కార్యదర్శి శ్రీరాములు, సభ్యులు సదానంద చారి, నరసింహ చారి, రాజశేఖరం,సమ్మయ్య, ఖాజానయీముద్దీన్, శేషయ్య తదితరులు సంజీవరెడ్డిని శాలువాతో, పూలదండతో ఘనంగా సత్కరించారు. తనపై నమ్మకంతో రాష్ట్ర బాధ్యతను అప్పగించినందుకు సం జీవరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. తనకు ఈ అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## మొక్కజొన్నలకు మద్దతు ధర రూ. 2400 కల్పించాలి

### ఎఐకెఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ రెడ్డీ హంస రెడ్డి

**ప్రజాపక్షం/హనుమకొండ కలటౌన్ :** ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ (ఏఐకెఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ రెడ్డి హంసా రెడ్డి మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతులు, ఉత్పత్తి ఖర్చులు పెరిగి ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు సరైన మద్దతు ధర రాక రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతూ వ్యవసాయాన్ని వదిలి కూలీలుగా, సంఘటిత కార్మికులుగా మారుతున్న పరిస్థితులు కనబడుతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పత్తి పంట దెబ్బతిని తీవ్రంగా నష్టపోయి ఉన్న రైతాంగం అనేక ఇబ్బందులు పడి ప్రత్యామ్నాయంగా పండించినమొక్కజొన్న పంటను రైతులు అమ్ముకోవడానికి ప్రయత్నిస్తే సరైన మార్కెట్ సౌకర్యం లేక వ్యాపారులు, మధ్య దళారులు మద్దతు ధర క్వింటా 2400 రూపాయలకు కొనాల్సింది పోయి కేవలం 1800 రూపాయల లోపు మాత్రమే కొనుగోలు చేస్తూ రైతులను ముంచుతున్నారన్నారు. రాష్ట్రప్రభుత్వం మక్కల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించిన క్షేత్రస్థాయిలో అమలు చేయడం లేదని, ఇదే వ్యాపారులకు,

**కొనుగోలు కేంద్రాలలో**

కుంటి సాకులతో రైతుల మొక్కలను కొనుగోలు చేయకుండా రైతులను నష్టపరిచే యంత్రాంగంపై చర్యలు చేపట్టి రైతులు మొక్కజొన్నలను భేషరతుగా మద్దతు ధరకు కొనుగోలు చేసి వారికి న్యాయం చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఓక్కల కిషన్, కర్ర రాజిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మల్లారెడ్డి, చీపురు ఓధయ్య లక్ష్మి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమతుల్య ఆహారం, వ్యాయామంతో ఆరోగ్యం

**ప్రజాపక్షం/హభుమకొండ టౌన్ :** ప్రతిరోజు సమతుల్య ఆహారం తీసుకుంటూ వ్యాయామం ద్వారా మంచి ఆరోగ్యవంతులుగా, ఎటువంటి జబ్బుల భారీ పడకుండా జీవించవచ్చునని సామాజికవేత్త, మిల్లెట్స్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినాన్ని పురస్కరించుకొని ఆయన మాట్లాడుతూ బిజీ జీవితంలో చాలా మంది తినే ఆహారం పట్ల శ్రద్ధ వహించక అనేక ఇబ్బందులు పాలవుతున్నారని తీసుకునే ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి జంక్ ఫుడ్ జోలికి పోకుండా ముఖ్యంగా యువత పిల్లలు జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని, ప్రతినిత్యం తప్పనిసరిగా కనీసం 30 నిమిషాలు వీలైన వ్యాయామం చేస్తూ ఆరోగ్యవంతులుగా జీవించాలని తెలిపారు. ఆరోగ్యం మహాభాగ్యం అన్న సూక్తిని ఎరిగి జీవనాన్ని ఆనందమయం చేసుకోవాలని ముఖ్యంగా జర్నలిస్టు సోదరులు వార్తల సేకరణను ఒత్తిడికి గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## నాయి బ్రాహ్మణెల సంఘటితమే లక్ష్యంగా పనిచేయాలి



**ప్రజాపక్షం/వెంకటాపూర్ :** మండలం లోని లక్ష్మీ దేవి పేట గ్రామంలో మంగళవారం నాయి బ్రాహ్మణ సేవా సంఘం మండల సమావేశం కురుమళ్ళ సంపత్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు జంపాల రవీందర్ ముత్యాల రాజు హాజరయ్యారు.రవీందర్ మాట్లాడుతూ మండలంలోని నాయి బ్రాహ్మణల సమస్యలపై అందరూ సంఘటితం కావలసిన సమయం వచ్చిందన్నారు. నాయి బ్రాహ్మణుల ఐక్య పోరాటాలకు సిద్ధంగా ఉండాలని అన్నారు. వృత్తిపై కార్పొరేట్ శక్తుల దాడిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలనీ ఆయన పిలుపునిచ్చారు.మండల అధ్యక్షులుగా కురుమళ్ళ సంపత్, ఉపాధ్యక్షులుగా దుబ్బాక ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా మురహరి సంపత్, కోశాధికారిగా చెన్న శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా మొగిలిచర్ల అనిల్, సభ్యులుగా మద్రిపల్లి కిషన్, చెన్న కుమార్, చెన్న భూమయ్య, చెన్న శంకర్, దుబ్బాక క్రాంతి, కురుమళ్ళ భద్రయ్య, దేవరకొండ వేణు, దేవరకొండ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## మండలకేంద్రంలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాపక్షం/టేకుమట్లః వేసవికాలంలో ప్రజలకు,ప్రయాణికులకు దాహం తీర్చేందుకు మండల కేంద్రంలోని బస్టాండ్ అవరణలో గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పటు చేశారు.సర్పంచ్ మాట్ల శ్రీనివాస్,ఎంపిడివో పనస అనిత హజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు.మండల కేంద్రానికి పనుల కోసం వచ్చే ప్రయాణికులకు,ప్రజలకు ఈ చలివేంద్రం ఎంతో మందికి ఉపయోగపడుతుందని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపివో సురేష్, కార్యదర్శి అడగాని సాంబశివరావు,రేణుకుంట్ల శ్రీధర్,శ్రీకాంత్,గ్రామస్తులు తదితరులు పాల్గోన్నారు.

## ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఇద్దరి రిమాండ్

**ప్రజాపక్షం/మహాదేవపూర్:**ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు.మండలకేంద్రంలో గత 2022 వ సంవత్సరంలో ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించారనే ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టుకు హజరు పరిచారు.వారిరువురిపై నమోదైన కేసులో కోర్టు విచారణకు హాజరు కాకపోవడంతో మెజిస్ట్రేట్ ఇద్దరిపై నాన్‌బెయిలబుల వారెంట్ జారీ చేసారు.ఈ మేరకు మంగళవారం పోలీసులు పట్టుకుని భూపాలపల్లి జిల్లా మెజిస్ట్రే ఎదుట హాజరు పరిచినట్లు తెలిపారు.మెజిస్ట్రేట్ ఆదేశాలమేరకు ఇద్దరినీ రిమాండ్‌కు పంపి పరకాల సబ్ జైలుకు పంపినట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు.

# బాటసారులకు చల్లని మజ్జిగ పంపిణీ

ప్రజాపక్షం/నెక్కొండ:వేసవి తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న బాటసారుల దాహార్తిని తీర్చేందుకు నెక్కొండ మండలం గుండ్రపల్లిలోని ఎస్ ఆర్ టెంట్ హౌస్ నిర్వాహకులు చలివేంద్రం ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ప్రతి రోజూ తాగునీటిని అందించడంతో పాటు మంగళవారం ప్రత్యేకంగా బాటసారులకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. బిజెపి నాయకులు దామచర్ల రామారావు ఆర్థిక సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ప్రయాణికులు లబ్ధి పొందారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి వారం లస్సీ లేదా మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమాజంలో ఉన్న వారు ఇలాంటి సేవా కార్యక్రమాలకు ముందుకు రావాలని వారు కోరారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం

### యూత్ ఫర్ సొసైటీ ఫౌండర్ కోడిమాల శ్రీనివాసరావు

ప్రజాపక్షం/ఖిలా వరంగల్:ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఏవివి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ ఫర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆరోగ్య విధానంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి యూత్ ఫర్ సొసైటీ ఫౌండర్ కోడిమాల శ్రీనివాసరావు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన ప్రజలతోనే ఆరోగ్యవంతమైన తెలంగాణ, భారతదేశం ఏర్పడుతుందని కావున ప్రతి ఒక్కరూ మంచి ఆహారం తీసుకొని పర్యావరణాన్ని రక్షిస్తూ ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ కల్తీ లేని, జంక్ ఫుడ్ మానేసి ప్రజలందరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి శాస్త్ర సాంకేతిక రంగంతో అభివృద్ధి వైపు పయనించాలని అలాగే మంచి ఆహార అలవాట్లు శాకాహారాన్ని ఎక్కువగా తీసుకొని ఆరోగ్యవంతులుగా జీవించాలని అలాగే ఫుడ్ సేఫ్టీ అధికారులు కల్తీపై తగు చర్యలు తీసుకొని ప్రజలను కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల యూత్ ఫర్ సొసైటీ అధ్యక్షుడు దేవి శ్రీ ప్రసాద్, సీనియర్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు రోహిత్, నవదీప్ జల్లి, వంశీ, సందాని, కె శివ, సాత్విక అంజలి, నిఖిల్, బి పూజిత, తదితరులు పాల్గొన్నారు.

# మూడు రైస్ మిల్లుల ఆస్తుల జప్తుకు రంగం సిద్ధం?

ప్రజాపక్షం/నెక్కొండ:వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో మూడు గ్రామాలకు చెందిన రైస్ మిల్లులపై ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో సిఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) ధాన్యాన్ని తీసుకొని ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యాన్ని ఇవ్వకుండా, కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులను ఎగ్గొట్టినట్లు ఆరోపణలు వెలుగుచూశాయి. ఈ నేపథ్యంలో ఆర్ఆర్ చట్టం కింద సంబంధిత మిల్లుల యజామాన్యాల ఆస్తులను జప్తు చేసి, రైస్ మిల్లులను సీజ్ చేయడానికి జిల్లా స్థాయి అధికారుల నుండి ఆదేశాలు జారీ అయినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రెవెన్యూ అధికారులు గ్రౌండ్ లెవల్లో వివరాలు సేకరించి, ఆస్తుల గుర్తింపు అంచనాల ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు సమాచారం. అయితే అధికారుల చర్యలపై మిల్లుల యజామాన్యాలు ఎలా స్పందిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు ప్రభుత్వం నిజంగా ఆస్తుల జప్తు, మిల్లుల సీజ్ వరకు వెళ్తుందా లేదా అన్నది త్వరలో తేలనుంది.

# మంత్రి సీతక్కపై అసత్య ప్రచారాలు మానుకోవాలి



ప్రజాపక్షం/తాడ్వాయి:మంత్రి సీతక్కపై బిఆర్ఎస్ నాయకుల అసత్య ప్రచారాలు మానుకోవాలని, మేడారం సమ్మక్క పూజారి సిద్దబోయిన రానా రమేష్ కుటుంబానికి అండగా ఉన్న మంత్రి సీతక్క పై అసత్య ప్రచారాలు చేస్తున్న స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబుపై తీవ్ర స్థాయిలో మేడారం మాజీ ఎంపిటిసి బత్తిని రాజు గౌడ్ మండిపడ్డారు. ఆయన మాట్లాడుతూ మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతల గద్దెల వద్ద ప్రమాదానికి గురైన పూజారి సిద్దబోయిన రమేష్ కుమారుడు యువన్‌ను మంత్రి సీతక్క పరామర్శించి తన స్వంత ఖర్చులతో వైద్యం చేయిస్తానని హామీ ఇచ్చారు. అయినా కూడా బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు తప్పుడు సమాచారంతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ నాయకులు రాజకీయ లబ్ధి కోసం మంత్రి సీతక్కపై అసత్య ప్రచారాలతో బురదజల్లే ప్రయత్నం చేస్తే సహించ బోమని అన్నారు. కెటిఆర్ మేడారం వస్తున్నారని 10వేల మందికి భోజనాలు ఏర్పాట్లు చేస్తానని 2వేల మందికి భోజనాలు ఏర్పాటు చేసి డబ్బులు మిగిలించుకున్న నీచ చరిత్ర మీది అని అన్నారు. సమ్మక్క తల్లి పూజారి సిద్దబోయిన రానా రమేష్ స్వయంగా మాట్లాడుతూ మా కుటుంబానికి అండగా మంత్రి సీతక్క ఉన్నారని తెలిపారు. దీనిని బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాజకీయం చేయవద్దని ఆయన చెప్పారు. అయినా కూడా బిఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారం చేయడం తగదని మేడారం మాజీ ఎంపిటిసి బత్తిని రాజు గౌడ్ అన్నారు.

# రైల్వే స్టేషన్ వద్ద రోడ్ల విస్తరణకు చర్యలు



ప్రజాపక్షం/నెక్కొండ:నర్సంపేట నియోజకవర్గ పరిధిలోని నెక్కొండ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో రోడ్ల విస్తరణకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు నర్సంపేట ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి, దక్షిణ మధ్య రైల్వే కాజిపేట్ జోన్ నార్త్..సౌత్ డివిజనల్ ఇంజనీర్ అంజిరెడ్డిని కలిసి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ నెక్కొండ రైల్వే స్టేషన్‌కు ఇరువైపులా రోడ్లు చాలా ఇరుకుగా ఉండడం వలన ప్రజలు, బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. దీనితో తరచుగా ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. కాబట్టి రోడ్ల విస్తరణకు డివిజన్ స్థాయిలో అనుమతులు మంజూరు చేయాలని, తద్వారా రైల్వే జనరల్ మేనేజర్ ద్వారా సాంక్షన్ పొందిన పనులు త్వరితగతిన ప్రారంభించేందుకు కృషి చేస్తామని ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి తెలిపారు.

**అండర్ బ్రిడ్జి గోడల తొలగింపుపై ఎంఎల్ఏ కృషి**

నెక్కొండ ప్రాంతంలో అండర్ బ్రిడ్జి వద్ద నిర్మించిన గోడలు ప్రజలకు తీవ్ర అసౌకర్యాలు కలిగిస్తున్న నేపథ్యంలో వాటి తొలగింపుకు ఎంఎల్ఏ మాధవరెడ్డి కృషి చేయడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ముందడుగు వేసిన ఎంఎల్ఏకు ప్రజలు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఈ గోడల తొలగింపుతో సమస్య త్వరలోనే పరిష్కారం కానుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎంఎల్ఏ తీసుకున్న ఈ చర్య ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని వారు పేర్కొన్నారు.

# ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులా..ఇదేనా ప్రజాపాలన

### మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం



ప్రజాపక్షం/ నర్సంపేట : ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులా... ఇదేనా ప్రజాపాలనని... పరిగి నియోజకవర్గం కళాపూర్, రాపోల్ రైతుల భూములను ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో 1200 వందల ఎకరాల భూమిని కోల్పోతున్న రైతులను పరామర్శకు వెళ్తున్న క్రమంలో హరీష్ రావును అరెస్ట్ చేయడం అత్యంత సిగ్గుమాలిన చర్య అని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. నర్సంపేట పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజ ఆస్తులకు రక్షణగా ఉండవలసిన మంత్రులు ముఖ్యమంత్రి అండతో నిత్యం చేస్తున్న మైనింగ్, భూముల దందాలను అసెంబ్లీలో, బయట మీడియాలో ప్రశ్నిస్తున్న మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావును మంగళవారం కోకాపేటలోని వారి ఇంట్లో గృహనిర్బంధం చేసి పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. మార్పు పేరుతో, అమలు గాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రజల భూములను కబ్జాలు చేయడంతో పాటు అక్రమంగా మైనింగ్ దందాలు చేస్తున్నది, కబ్జాలను, అక్రమ దందాలను అరికట్టవలసిన ప్రభుత్వం ప్రశ్నించిన ప్రతిపక్షాలను గృహనిర్బంధం చేసి అరెస్టు చేయడమన్నా సరికాదన్నారు. ప్రజలకిచ్చిన హామీల గురించి ప్రజల పక్షాన పోరాటం చేస్తే అక్రమ కేసులా, మీ తాటాకు చప్పుళ్లకు బిఆర్ఎస్ నాయకులు అదిరేది లేదని, బెదిరేది లేదన్నారు. మాకు పోరాటాలు, ఉద్యమాలు, కేసులు, జైల్లు అరెస్టులు కొత్త కావని, పోలీసుల బలం ఉపయోగించి, ప్రతిపక్షాలను అణిచివేయాలని చూడటం అప్రజాస్వామికమన్నారు.

# పారిశుధ్య మహిళా కార్మికులకు చీరల పంపిణీ



ప్రజాపక్షం/ఖిలా వరంగల్:ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని 40వ డివిజన్ అధ్యక్షుడు మీర్జా అక్తర్ పారిశుధ్య మహిళా కార్మికులకు చీరలను మంగళవారం పంపిణీ చేశారు. సమాజ ఆరోగ్యానికి పునాది వేస్తున్న పారిశుధ్య మహిళ కార్మికుల సేవలను గుర్తించడం చాలా అవసరమని ప్రతి రోజు శుభ్రత కోసం శ్రమిస్తున్న మహిళా కార్మికులు నిజమైన ఆరోగ్య యోధులు అని అక్తర్ పేర్కొన్నారు. వారి కష్టానికి గౌరవం ఇవ్వడం సమాజ బాధ్యత అని మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించే ప్రయత్నమని చెప్పారు. మహిళా సాధికారతకు ఎలాంటి చర్యలు బలమైన పునాది వేస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. పారిశుధ్య కార్మికులు సమాజానికి అనేక సేవలు అందిస్తున్నారని ఆయన కొనియాడారు. వారి ఆరోగ్యం, భద్రత పట్ల ప్రతి ఒక్కరు శ్రద్ధ చూడాలని సూచించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ కమిటీ సభ్యుల పాల కుమారస్వామి(రవి) మాట్లాడుతూ అక్తర్ దాతృత్వాన్ని ప్రశంసించారు. . ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం మరింత ప్రాముఖ్యత సంతరించుకుందని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పులకు దారి తీస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తోట సతీష్, న్యాలపోగుల ప్రశాంత్, లడ్డు, జమాన్ కృష్ణ, పారిశుధ్య మహిళా కార్మికులు విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేట పట్టణాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దుతాం

### పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం



ప్రజాపక్షం/ నర్సంపేట: నర్సంపేట పట్టణాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని, పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమనిమున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానందంలు అన్నారు. నర్సంపేట మున్సిపల్ పరిధిలోని 26వ వార్డు నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డిఆదేశాల మేరకు మంగళవారం నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి పెండెం శ్రీ లక్ష్మీ రామానంద్, వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా , స్థానిక కౌన్సిలర్ మండల శ్రీదేవిశీనివాస్‌లతో కలిసి వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ మాట్లాడుతూ నర్సంపేట పట్టణాన్ని మోడల్ సిటీగా అన్ని రంగాలలో తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు, శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి నేతృత్వంలో వారి సహకారంతో 26వ వార్డులో ఇటీవల దాదాపు రూ.90లక్షలతో మెయిన్ రోడ్డు నుండి జయశ్రీ థియేటర్ నుండి పెద్ద కాలువ వరకు సీసీ రోడ్డు, మెయిన్ రోడ్డు భవాని టెంట్ హౌస్ నుండి పెద్ద కాల్వ వరకు సిసి రోడ్డు, సైడ్ కాలువ, మెయిన్ రోడ్డు సెంట్రల్ బ్యాంకు నుండి పెద్ద కాలువ వరకు సీసీ రోడ్డు మరియు కల్వర్టులు, పెద్ద కాలువ వెనుక కాలనీలో సిసి రోడ్డు, పెద్ద కాలువపై డబుల్ సిసి రోడ్డు, సంజీవని అనాథ ఆశ్రమం వద్ద దాదాపు 100 మీటర్ల సిసి రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు, పార్టీలకతీతంగా వార్డులను అభివృద్ధి చేయడమే తమ కర్తవ్యమన్నారు. శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు పర్యటనకు వచ్చినప్పుడు పలు హామీలను ఇవ్వడం జరిగిందని, ఎన్నికలు ముగిసి పాలకవర్గం ఏర్పడిన వెంటనే వాటిని అమలు చేసే దిశగా ముందుకు వెళ్తున్నామన్న విషయాన్ని వార్డు ప్రజలకు గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని తప్పక నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కాట భాస్కర్, నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్, మాజీ వార్డు సభ్యులు గాజుల రమేష్, మాజీ ఎంపిటిసి కాట ప్రభాకర్, వార్డు ఆఫీసర్లు కాట శ్రీనివాస్, సుప్పు, వార్డు జవాన్ మాదాసి భరత్, వార్డు నాయకులు మేడం కుమార్, కొత్తగట్టు ప్రశాంత్, కొత్తగట్టు కుమార్, దేశీ సాయి పటేల్, కీసరి రాంబాబు, కాట అఖిల్, నల్గొండ వంశీ, మండల గణేష్, కొత్తగట్టు సాయిరాజు, ఊగ సాయి చరణ్, దేవోజు హేమంత్, చీకటి శివమణి, గుండెబోయిన కోటి, అదుప రాంబాబు, నాడెం రామకృష్ణ, రవి, శ్రీనివాస్, రమేష్, వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# దళితులు క్రైస్తవ మతంలో చేరితే ఎస్సీ హోదా ఉండదని సుప్రీంకోర్టు తీర్పు అన్యాయం

ప్రజాపక్షం/ వరంగల్ : క్రైస్తవ మతంలో చేరిన దళితులకు ఎస్సీ హోదా ఉండదని ఇటీవల సుప్రీంకోర్టు చేసిన తీర్పు చాలా అన్యాయంగా ఉందని, తక్షణమే దీనిని పునః సమీక్షించాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారంగా ప్రతి వ్యక్తికి తనకు విశ్వాసము ఉన్న నచ్చిన మతంలో చేరడానికి స్వేచ్ఛ ఉన్న విషయాన్ని విస్మరించరాదన్నారు. ఆర్టికల్ 15 ప్రకారం కులము ,మతము ఆధారంగా వివక్ష చూపరాదని రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొనబడిందన్నారు. మతము ఆధ్యాత్మిక విషయమైతే కులము సామాజిక సమస్యలతో కూడిన విషయమన్నారు. మన దేశంలో కుల వివక్షత శతాబ్దాలుగా కొనసాగుతున్న విషయం కాదనలేని నగ్న సత్యమన్నారు. దళితులు ఏమతంలో ఉన్న కులవివక్షత వెంటాడుతూనే ఉందన్నారు. మతం మారినప్పటికీ దళిత బడుగు బలహీన వర్గాలపై కులం పేరుతో అనేక హింసాత్మక సంఘటనలు జరుగుతూనే ఉన్నాయన్నారు. కుల వ్యవస్థ అంతరించినప్పుడే కుల వివక్షత పూర్తిగా నిర్మూలించబడుతుందన్నారు. ఈ వాస్తవాన్ని గమనించకుండా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో దళితులకు తీవ్రంగా అన్యాయం జరుగుతుందన్నారు. దళితుల, బడుగు బలహీన వర్గాల హక్కులను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం పైనే ఉందన్నారు. సుప్రీం తీర్పు పై దేశవ్యాప్తంగా జరుగుతున్న చర్చలను ఆందోళనలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం పునర్విచారణకై అప్పీలు చేయాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు.

# " ధూల్మిట్ట ప్రభుత్వ పాఠశాల కొత్త ఒరవడి"

ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట : ధూల్మిట్ట ప్రభుత్వ ఉపాధ్యాయుల కృషితో కార్పొరేట్‌కు ధీటుగా రాష్ట్ర స్థాయిలో మొట్టమొదటి సారిగా, 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు క్యూఆర్ కోడ్ హాల్‌టికెట్ల విధానంతో వార్షిక పరీక్షల నిర్వాహణను సిద్దిపేట జిల్లా ధూల్మిట్ట మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ఉపాధ్యాయులతో కలసి ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డి ప్రారంభించారు. గత సంవత్సరం బార్‌కోడ్‌తో నిర్వహించిన ఇదే ప్రభుత్వ పాఠశాల, ఈ సంవత్సరం ఇలా క్యూఆర్ కోడ్‌తో నూతన ఒరవడితో ముందుకు వచ్చారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలు అనగానే సమయానికిరాని ఉపాధ్యాయులు, ఒకవేల వచ్చినా... వచ్చామా అంటే వచ్చి వెళ్లిపోవడం, వీటికితోడు విద్యార్థులకు కనీస విద్యా బోధనవసతులు కూడా కల్పించని దుస్థితి... ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉంటాయి. కానీ ప్రభుత్వ పాఠశాల అంటే ఇది కాదుఅని, నాణానికి మరోవైపు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటుగా, గత కొన్ని సంవత్సరాలుగా పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పాఠశాల ఉపాధ్యాయ బృందంతో కలసి, జిల్లా విద్యాశాఖ ఆదేశాలకు మించి ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తూ ఉత్తమ ఫలితాలను సాదిస్తోంది ధూల్మిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డితో పాటుగా ఉపాధ్యాయుల అంకిత భావం విద్యార్థుల కృషితో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ధూల్మిట్ట ప్రభుత్వ పాఠశాల ఉత్తమ ఫలితాలు సాధిస్తోంది. తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం నుండి (నేటి నుంచి సమ్మేటివ్ అసెస్మెంట్ (ఎస్ఎ2) వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల నిర్వాహణలో ధూల్మిట్ట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాష్ట్ర స్థాయిలో మొట్ట మొదటి సారిగా విద్యార్థులకు క్యూర్‌కోడ్ హాల్‌టికెట్ల విధానంను, పాఠశాల పరీక్షల విభాగం ఇన్‌చార్జి చిలుక వెంకటయ్య ఆద్వర్యంలో పాఠశాల సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు సుద్దాల రంజిత్ కుమార్ రూపొందించినట్లు ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డి తెలిపారు. ఇందులో విద్యార్థి పేరు, తరగతితో పాటుగా, ప్రతి పరీక్షలో వచ్చిన ఫలితాలతో పూర్తి సమాచారంను ఒక్క క్యూఆర్ కోడ్ స్కానర్‌తో ప్రతి తల్లి తండ్రులు ఇంటి వద్ద నుండే సమాచారంను తెలుకో వచ్చని క్యూఆర్ కోడ్ తయారు చేసిన పాఠశాల సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు సుద్దాల రంజిత్ కుమార్ తెలిపారు. ఇందులో అన్నివివరాలు సంక్షుప్తంగా ఉన్నాయని వారు తెలిపారు. దీనిని మండల విద్యాధికారి మీనాంజనేయులుతో ప్రారంభించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డి తెలిపారు. గతనెల నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ఫలితాల్లో ఇదే పాఠశాల జిల్లా స్థాయిలో చక్కని ప్రతిభను కనబరిచి, పలువురు విద్యార్థులు అర్హత సాధించినట్లు వారు తెలిపారు. కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ధూల్మిట్ట ప్రభుత్వ పాఠశాల జిల్లాకే ఆదర్శంగా నిలవడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డితో పాటుగా ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు మండల విద్యావేత్తలు అభినందించారు. రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఉపయోగపడే మరికొన్ని విద్యావిధానానికి నాంది పలుకుతామని ధీమా వ్యక్తం చేశారు పాఠశాల ఉపాధ్యాయులు.




# రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా పోలీసుల ప్రత్యేక చర్యలు

ప్రజాపక్షం/సంగారెడి: జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ తెలిపారు. ఈ సందర్బంగా నేషనల్ హైవే ఆథారిటీ ఆప్ ఇండియా అధికారులతో మునిపల్లి టోల్ ప్లాజా వద్ద సమీక్ష సమావేశం నిర్వహించి జాతీయ రహదారులపై చోటు చేసుకుంటున్న ప్రమాదాలపై సమగ్రంగా చర్చించారు. ప్రమాదాలకు అదికంగా జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి ఆ ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు (సైన్ బోర్డులు) స్పీడ్ లిమిట్ సూచనలు రిప్లిక్రు్ల ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు ఇంజనీరింగ్ లో లోపాలు ఉన్నట్లయితే మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. అదే విధంగా రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వాహనదారులు తప్పసరిగా ట్రాపిక్ నిబందనలు పాటించాలని అదిక వేగం ,నిర్లక్ష్య డ్రైవింగ్ ను నివారించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై జాగ్రత్తలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే ఆథారిటీ ఆప్ ఇండియా మేనేజర్ శివ ప్రకాష్, ఇండిపెండెంట్ ఇంజనీర్ డోంగ్రే దక్కని టోల్వే స్ ప్రైవేట్ లిమిటెడ్‌ప్రాజెక్ట్ హెడ్ ప్రవీణ్ దూబే ఐఐటి రోడ్డు ఇంజనీరింగ్ ఎక్స్పర్ట్ దిగ్వజయ్, సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, జహీరాబాద్ డిఎస్పీ సైదా నాయక్ ఇన్స్పెక్టర్స్ వెంకటేష్ ,రామ కృష్ణ రెడ్డి, శివలింగం, సుమన్ కుమార్ ఎస్సీలు రాజేష్, నాయక్, వినయ్, కాశినాథ్, రాజేందర్ రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# వివాహానికి ఆర్థిక సహాయం అందజేత

ప్రజాపక్షం/శివ్వంపేట:మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన చాకలి రమేశ్‌ర మేశ్ వివాహానికి పుస్తెమెట్టెలకు రూ. 10వేల ఆర్థిక సహాయాన్ని పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ చింతల వెంకటరాంరెడ్డి సహకారంతో సర్పంచ్ పెంజర్ల మమత నర్సింహాయాదవ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సత్యనారాయణ, వార్డు సభ్యులు సదానందం, పశురాం, ఉప్పునూతన సత్యనారాయణగౌడ్, దత్తాత్రెయగౌడ్, బజారి శ్రీనివాస్‌రెడ్డి, ఎలుకంటి వినోద్‌కుమార్, బోల్ల మహేశ్, గడ్డం శంకర్, ఎల్క ప్రభాకకర్‌రెడ్డి, ఉప్పు నూతన శివాగౌడ్, ఎండి ఖాధర్‌బాషా, బజారి కృష్ణారెడ్డి, బోల సిద్దు, ఎలుకంటి వెంకటేష్, సట్టి విటల్, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్ ఫార్మసీ హ్యుమానిటీస్‌లలో ఫుల్ టైమ్ కోర్సులు

ప్రజాపక్షం/ పటాన్‌చెరు :గీతం డిమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాదు ,బెంగుళూరు, విశాఖపట్నం లలో నెలకొని ఉన్న మూడు ప్రాంగణాలలో 202627 విద్యా సంవత్సరానికి గాను పిహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోందని పరిశోదన అభివృద్ధి డైరెక్టర్ ప్రొఫెసర్ రామగోపాల్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్ సైన్స్ ,మేనేజ్‌మెంట్, ఫార్మాసీ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస, న,న్యాయశాస్త్రం (లా) వంటి విబిన్న విబాగాలో ఫుల్ టైమ్ అభ్యర్థులకు ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పరిశ్రమ నిపుణులు ,శాస్త్రవేత్తల కోసం రూపొందించిన ఎక్స్ ట్రామ్యూరల్ పిహెచ్ డి ప్రోగ్రామ్ ఇంజనీరింగ్ సైన్స్ పార్మసీ , విభాగాలలో అందుబాటులో ఉందని ఆయన తెలిపారు. సంబదిత మాస్టర్ డిగ్రీ లో కనీసం 55 శాతం మార్కులు కనీసం 75 శాతం మార్కులతో నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ ,ఎంపిల్ అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేయడానికి అర్హులని ప్రొఫెసర్ రామగోపాల్ పేర్కొన్నారు. ఫలితాల కోసం ఎదురు చూస్తున్న చివర ఏడాది పోస్ట్ గ్రాడ్యుయేట్ ,అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. గీతం రిసెర్చ్ ఆడ్మిషన్ దాని తరువాత జరిగే ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేది మే. 11 2026 అని ప్రొఫెసర్ రామగోపాల్ స్పష్టీకరించారు. ప్రవేశ పరీక్షలు మే 23 (ఆన్‌లైన్‌లో ) మే 30 న (ప్రత్యక్షంగా జరుగుతాయని ప్రోగ్రామ్ ఆగస్టు 24 2026న ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అర్హత కలిగిన ఫుల్ టైమ్ పిహెచ్ డీ పరిశోదకులకు మూడు సంవత్సరాలు వరకు నెలకు రూ 33 వేల పెలో షిప్‌తో పాటు ఆదునాతన పరిశోదన సౌకర్యాలు ,సహకారాలు ,ఆకడమిక్, మద్దతును గీతం అందిస్తుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు గీతం అదికారిక పోర్టల్ లో దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ సూచించారు.

# విద్యుత్ సమస్యలతో రైతులు అయోమయానికి గురి

రైతు రక్షణ సమితి జిల్లా గౌరవ అద్యక్షులు మైసయ్యయాదవ్

ప్రజాపక్షం/శివ్వంపేట : విద్యుత్ సమస్యలతో రైతులు అయోమయానికి గురవుతున్నారని రైతు రక్షణ సమితి జిల్లా గౌరవ అధ్యక్షులు మైసయ్యయాదవ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో కరెంట్ సమస్యలు అధికమవుతున్నాయని, ప్రస్తుతం రైతులకు యాసంగి పంట పొట్టదశలో ఉందని, సరైన సమయానికి నీరు అందకపోతే రైతులకు వరిపంట దిబ్బదినే ప్రమాదం ఉందన్నారు. రైతుబంధు ఎకరానికి రూ. 6వేలు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు అమలుచేయకపోవడం బాధకరం అన్నారు. రైతుబంధు వానకాల పంటు జూన్ మొదటివారంలో, యాసంగి పంటకు డిసెంబర్ మొదటివారంలో వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలుచేకపోతే రైతులతో కలసి ఆందోళనలు చేస్తామన్నారు.

# మండలాన్ని సందర్శించిన డిఆర్డిఓ బాలయ్య

మన తెలంగాణ/చౌటకూర్ :మంగళవారం రోజు అడిషనల్ డిఆర్డిఓ సంగారెడ్డి జిల్లా గారు కోర్పోల్ గ్రామాన్ని సందర్శించి గ్రామంలో నూతనంగా నిర్మించినటువంటి డ్రైయిన్ ఎండ్ పాయింట్ సోక్ పీట్ ను పరిశీలించడం జరిగింది. అడిషనల్ డిఆర్డివో జి.బాలరాజు మాట్లాడుతూ, అన్ని గ్రామాలలో డ్రైయిన్ అండ్ పాయింట్ లను నిర్మించుకోవాలని, భూగర్భ జలాలు పెరగడానికి దోహదపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మధులత, ఎంపీడీవో కే.శంకర్, ఏపీఓ రామ్మోహన్ ఈసీ, మహేశ్వర్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు రమేష్, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

# జిల్లాలో ప్రత్యేక అగ్ని మాపక భద్రత తనిఖీలు



ప్రజాపక్షం/సంగారెడ్డి: తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిపిన్స్ విభాగం ఆద్వర్యంలో జిల్లాలోని పరిశ్రమలు ,నివాస విద్యా, వాణిజ్య ,ఇతర సంస్థలలో అగ్నిమాపక భద్రత ప్రమాణాల అమలు పై ప్రత్యేక తనిఖీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు జిల్లా అగ్ని మాపక శాఖాధికారి బి. నాగేశ్వరరావు తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ప్రతి వారం ముందస్తు సమాచారం ఇచ్చి సంబందిత యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసి నేషనల్ బిల్డింగ్ కోడ్ (ఎన్‌బిసి) ప్రకారం అగ్ని మాపక పరికరాల ఏర్పాటు నిర్వహణ సక్రమ పనితీరు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా మంగళవారం పటన్‌చెరు స్టేషన్ అగ్ని మాపక అదికారితో కలసి పటాన్చెరు ఐడిఏ ,పశామైలారంలోని ఎం/స్ న్యూల్యాండ్ లాబరేటరీస్ లిమిటెడ్ యూనిట్ II ఎం /ఎస్‌క్రాన్ రిసర్చ్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. తనిఖీల సందర్బంగా సంబందిత సంస్థల సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణ అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు భద్రతా ప్రమాణాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. సంబందిత సంస్థలు నేషనల్ బిల్డింగ్ కోడ్‌కు అనుగుణంగా అగ్ని మాపక పరికరాలు ఏర్పాటు చేసినట్లు గమనించామని అయితే కొన్ని పరికరాలు పనిచేయకపోవడం సరైన నిర్వహణ లేకపోవడం వంటి లోపాలు గుర్తించి అట్టి లోపాలను వెంటనే సరిదిద్దాలని అన్ని పరికరాలు ఎప్పటికప్పుడు పనిచేసే స్థితిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యాలను ఆదేశించామని తెలిపారు. అదే విధంగా అగ్ని మాపక భద్రత ప్రమాణాలు పూర్తి స్థాయిలో అమలు చేసిన తర్వాత అవసరమైన న అబ్జెక్షన్ సర్టిపికేట్ (ఎన్‌ఓసి) కోసం ఫైర్ విభాగాన్ని సంప్రదించాలని సూచించారు. పారిశ్రామిక సంస్థల యాజమాన్యాలకు అగ్నిమాపక భద్రత పట్ల అవగాహన పెంచడం ప్రాణాలు ,ఆస్తులు, మౌలిక సదుపాయాలను రక్షించడం ఈ ప్రత్యేక తనిఖీ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. జిల్లాలో అగ్నిమాపక భద్రత నియమాలు కచ్చితంగా అమలుతున్నాయో లేదో నిర్దారించేందుకు ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన తెలిపారు.

# సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ప్రజాపక్షం/శివ్వంపేట : శివ్వంపేట మండలం గూడురు గ్రామంలోని బోయిని కొమురమ్మకు ప్రభుత్వం నుంచి మంజూరు అయిన రూ. 46,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మంగళవారం జిల్లా గ్రంధాలయ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్ చేతులమీదుగా అందజేశారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులతో ని రుపేదలకు ఎంతో మేలు కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమ ంలో రాధాకృష్ణ, శ్రీశైలంయాదవ్, దాడిగ నరేష్, కొండి దుర్గేష్, శ్రీ నివాస్ రెడ్డి, శంకర్‌గౌడ్, చందు, చిన్నయాదవ్, లబ్దిదారులు పాల్గొన్నారు.

# హరీష్‌రావును కలిసిన బిఆర్ఎస్ నాయకులు

ప్రజాపక్షం/సంగారెడ్డి:తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు ,సిద్దిపేట శాసన సభ్యులు తన్నీరు హరీష్‌రావు ను బీఆర్ఎస్ నాయకులు మాద్రి వృథ్వీరాజ్ , పటాన్‌చెరు పట్టణానికి చెందిన స్థానికులతో కలిసి వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

# ఘనంగా బేతాళ స్వామి జాతర బండ్ల ప్రదర్శన

ప్రజాపక్షం/అల్లాదుర్గం:మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం లో గల రెండవ అతిపెద్ద జాతరగా పేరుగాంచిన బేతాళ స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా ఇదవ రోజు మంగళవారం బేతాళ స్వామికి ఘనంగా ఎడ్ల బండ్ల ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు అయగ్రమాలనుండి అందంగా అలంకరించిన బండ్లను గ్రామ పురవీధుల గుండా భక్తిశ్రద్ధలతో డప్పు వాయిద్యాల మధ్య ఆట పాటలతో బేతాళ స్వామికి గోవిందా అని స్మరించుకుంటూ ఆలయం చుట్టూ ఐదు ప్రదక్షిణలు చేసి స్వామివారికి మొక్కలు తీర్చుకున్నారు. ఈ జాతరలో మేక పోతులబండి అందరి దృష్టి ఆకర్షింపచేసింది ఈ ఉత్సవాలను తిలకించడానికి చుట్టూ ప్రకలగ్రమాల ప్రజలు ఇతర రాష్ట్రాల ప్రజలు వందలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం జాతర భక్తులతో కిక్కిరిసిపోయింది. బేతాళ స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ ఆదేశానుసారం సీఐ రేణుక రెడ్డి ఎస్సై శంకర్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. వారు మాట్లాడుతూ, ఎవరైనా మారకద్రవ్యాలు మత్తు పానీయాలు అమ్మినట్లయితే సంగవి ద్రోహచర్యాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## నేడు హుండీ లెక్కింపు

**ప్రజాపక్షం/లింగాలఘణపురం :** మండలంలోని జీడికల్ గ్రామంలో గల శ్రీ వీరచాల రామచంద్రస్వామి దేవాలయంలో, ఈనెల 8వ తేదీన ఉదయం 11:30 నిమిషాలకు దేవాలయ ప్రాంగణంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించబడాలని దేవాదాయ శాఖ ఈవో వంశీ ఓ ప్రకటనలో తెలిపారు.

## ఉత్తమ సేవలకు గాను వైద్య సిబ్బందికి దక్కిన అవార్డులు




**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది మరికుకల అయోధ్య, ఆశ వర్కర్ బానోతు మంజులకు వైద్య రంగంలో అందించిన ఉత్తమ సేవలకు గాను మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చేతుల మీదుగా ఉత్తమ సేవ అవార్డు ప్రధానం చేశారు. అదేవిధంగా జిల్లా వైద్యాదికారి డా. మల్లిఖార్జున్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని వారు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది వారిని అభినందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. స్రవంతి, సీహెచ్‌వో రామ కిషన్, సూపర్‌వైజర్లు సులోచన, సుజన, రజిని, విష్ణువర్థన్ రెడ్డి, పాండరి పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్ గంగిడి లక్ష్మారెడ్డి గుండెపోటుతో మృతి

### ఎమ్మెల్యే కడియం పరామర్శ



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** మండలంలోని నిడిగొండ గ్రామ ఉప సర్పంచ్ గంగిడి లక్ష్మారెడ్డి మంగళవారం తెల్లవారు జామున ఆకస్మిక గుండెపోటుతో మృతిచెందడం జరిగింది. ఆయన మరణవార్త తెలుసుకున్న స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కడియం శ్రీహరి నిడిగొండ గ్రామంలోని ఆయన స్వగృహానికి చేరుకుని లక్ష్మారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మరణం మండల కాంగ్రెస్ పార్టీకి, వారి కుటుంబానికి తీరని లోటన్నారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల జగదీశ్ చందర్ రెడ్డి, నిడిగొండ పీఏసీఎస్ మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మహేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ వీరస్వామి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, రవి, గ్రామస్థులు, తదితరులున్నారు.

## చల్వాయి రైతు వేదికలో వెజిటేబుల్ మినీ కిట్ల పంపిణీ



**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** మండలం లోని చల్వాయి గ్రామం లో రైతు వేదిక నందు వెజిటేబుల్ మినీ కిట్ల పంపిణీ కార్యక్రమానికి అధ్యక్షతన జితేందర్ రెడ్డి హెచ్ ఈఓ జీవన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో మినీ కిట్ల పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది తెలంగాణలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు కూరగాయల మీని కిట్ల పంపిణీ కార్యక్రమం తరచుగా జరుగుతుంది ముఖ్యంగా రైతులకు అధిక అదాయం  అందించే పంట మార్పిడి విధానాలను ప్రోత్సహించడానికి ఉచితంగా కూరగాయల విత్తనాల మిశ్రమ విత్తనాల కిట్లను ఉద్యాన మిషన్ ద్వారా అందజేస్తారు ఈ కార్యక్రమానికి గోవిందరావుపేట మండల చల్వాయి గ్రామం రైతు వేదిక నుండి శ్రీకారం చుట్టడం జరిగింది ఏఓ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉచిత కూరగాయలు మినీ కిట్ల పంపిణీ కార్యక్రమం జరుగుతుంది పంట మార్పిడిని ప్రోత్సహించడానికి రైతుల ఆదాయాన్ని పెంచడానికి ఈ కిట్లను అందజేస్తారు ఇందులో హైబ్రిడ్ కూరగాయల విత్తనాలు ఉంటాయి ఈ కార్యక్రమం ద్వారా డ్రిప్ ఇరిగేషన్ వినియోగం ఆధునిక సాగు పద్ధతుల పై రైతులకు అవగాహన కల్పిస్తారు ఈ కిట్లలో వివిధ రకాల కూరగాయల విత్తనాలు ఉంటాయి ఇవి రైతులకు స్వల్పకాలంలో ఆదాయాన్ని వారి ఇంటి అవసరాలకు అవసరమైన కూరగాయలను అందిస్తాయి ఈ అవకాశాన్ని ప్రతి రైతు వినియోగించుకోవాలని వారు కోరారు హెచ్‌ఈఓ జీవన్ రెడ్డి మాట్లాడుతూ కూరగాయల సాగును ప్రోత్సహించారు. ఆసక్తి గల రైతులకు 500 రూపాయల విలువ గల ఐదు రకాల కూరగాయల విత్తనాలతో కూడిన కిట్లు ఉచితంగా అందించబడతాయని చెప్పారు ఒక్క మినీ కిట్లో టమోటా మిర్చి బెండ గోరు చిక్కుడు పాలకూర విత్తనాల ఉండి ఇవి సుమారు 20 గుంటల భూమికి సరిపడే విధంగా ఉంటాయని వివరించారు.  ఆసక్తి గల రైతులు తమ భూమి పట్టాదారు పాసుబుక్ జిరాక్స్ అధార్ కార్డు సమీప ఉద్యాన కార్యాలయాల్లో దరాఖాస్తు చేసుకుని విత్తనాలను పొందవచ్చని తెలిపారు ములుగు ఉద్యాన అధికారి వేముల జీవన్ రెడ్డిని సంప్రదించవలసిందిగి కోరారు ఈ కార్యక్రమంలో ఏఈఓ లు సాయి కుమార్ దాదాసింగ్ గోపాల్ రెడ్డి ఉట్ల పృథ్వీ రాజ్ రైతులు మేడిపల్లి రమేష్ బిక్షం రెడ్డి సంతోష్ రమేష్ సంతోష్ ఆశోక్ అంకం రాజేశ్వరరావు గూడురు శ్రీనివాసరావు రఘపతి తదితరులు పాల్గొన్నారు.

## అమెరికా సామ్రాజ్యవాద యుద్ధ ఉన్మాధాన్ని వ్యతిరేకించండి



ఎండి అబ్బాస్

**ప్రజాపక్షం/జనగామ :** అమెరికా సామ్రాజ్యవాద యుద్ధ ఉన్మాధాన్ని ప్రజలు, ప్రజాస్వామ్య వాధులు వ్యతిరేకించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్ పిలుపునిచ్చారు. మంగళవారం సిపిఎం జనగామ జిల్లా స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం సింగారపు రమేష్ అధ్యక్షతన జూబ్లీ గార్డెన్‌లో జరిగింది. ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ ఇరాన్‌లో అణు ఆయుధాలు ఉన్నాయనే పేరుతో అమెరికా ఇజ్రాయిల్ రెండు సామ్రాజ్యవాద దేశాలు ఇరాన్‌పై యుద్ధం చేయడంతో ఇరాన్‌లో చిన్న పిల్లలతో పాటు అనేక మంది మరణిస్తున్నారన్నారు. దీని ప్రభావం ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థపై పడుతుందన్నారు. ముఖ్యంగా భారతదేశంపై తీవ్రమైన ప్రభావం చూపడంతో పాటు భారీ నష్టాన్ని కలిగిస్తుందన్నారు. డీజిల్, పెట్రోల్‌తో పాటు ముడి సరుకుల కొరత ఏర్పడి ధరలు పెరగనున్నాయని ఇది గమణించాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికా సామ్రాజ్యవాద యుద్దాన్ని నిలపడం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్నలను మార్క్‌పెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్నలకు పూర్తిగా ధరలు తగ్గించారని దీనితో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం మార్క్‌పెడ్ ద్వారా కొనుగోలు చేస్తామని చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆహేల్య, రాపర్తి రాజు, బొట్ల శేఖర్, జిల్లా కమిటి సభ్యులు బూడిద గోపి, జోగు ప్రకాష్, సుంచు విజేందర్, ఉపేందర్,  చందునాయక్, నరేందర్, దేవదానం, కళ్యాణం లింగం పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలపై తూట్లు పొడిచిన హైకోర్ట్ తీర్పు-ఎస్ఎఫ్ఐ

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** రాష్ట్ర హైకోర్ట్ ఫీజు బకాయిలపై ఇచ్చిన తీర్పు సరికాదని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటి సభ్యురాలు మేడబోయిన మమత విమర్శించారు. మంగళవారం ప్రజాసంఘాల కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అ ధ్యక్షుడు పొదల లవకుమార్ అధ్యక్షతన జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటి సమావేశానికి ముఖ్య అతిథిగా మమత పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రియంబర్స్‌మెంట్ విషయంపై విద్యాసంస్థల యాజమాన్యం హైకోర్ట్‌ను ఆశ్రయించిందని రూ.8వేల కోట్లను ప్రభుత్వం చెల్లించాలని వారు కోరగా ఆ మొత్తాన్ని విద్యార్థుల నుంచి వసూలు చేసుకోవచ్చని కోర్టు తీర్పు ఇవ్వడం రాజ్యాంగం కల్పించిన విద్యాహక్కుకు విరుద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వమే ఈ మొత్తం చెల్లించి విద్యార్థులకు ఎలాంటి ఒత్తిడులు లేకుండా చర్యలు తీసుకుని వారి భవిష్యత్తును కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుమ, ఉపాధ్యక్షులు రమేష్, యాకన్న, నాయకులు ఆర్య, రమేష్, నజ్రీన్, సాత్విక్, తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు పేదలకు చేరాలి



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** ప్రభుత్వ పరంగా అమలయ్యే ఏ పథకం అయినా అర్హులైన నిరుపేదలకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా చేరుతున్నాయని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. జఫర్‌గడ్, స్టేషన్‌ఘనపూర్ మండల కేంద్రాలలోని రైతు వేదికలలో ఏర్పాటుచేసిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణి కార్యక్రమానికి కడియం ముఖ్య అతిథిగా హాజరై మండలానికి చెందిన 20 మంది కళ్యాణ లక్ష్మి లబ్దిదారులకు రూ.20లక్షల 02 వేల 320 విలువగల చెక్కులను, 45 మంది సీఎం సహాయ నిధి లబ్దిదారులకు రూ.13 లక్షల 29 వేల విలువగల చెక్కులను ఆయన పంపిణి చేశారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ సర్పంచ్‌లు, ఇతర ప్రజా ప్రతినిధులు ఎక్కడా ఏ విధమైన అవినీతికి ఆస్కారం ఇవ్వకుండా పనిచేయాలని సూచించారు. నిజమైన అర్హులకు సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలు అవసరం లేదని అర్హత ఉన వారికి సంక్షేమ ఫలాలు అందించడమే మన ధ్యేయంగా ఉండాలన్నారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలబడితేనే వాళ్లు మనల్ని గుర్తు పెట్టుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, తహశిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సుమన్, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లా వ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్ ములుగు జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కోగిల మహేష్ కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు లేక రైతులు అనేక అవస్థలకు గురవుతున్నారని తక్షణమే ములుగు జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మొక్కజొన్న పంటను రైతుల నుండి నేరుగా కొనే విధంగా చర్యలు చేపట్టాలని ములుగు జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలు లేక రైతులు పంటను వారి చేలలోనే నిల్వ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని దానిని కొంత మంది దళారులు ఆసరాగా చేసుకొని తక్కువ ధరకే పంటను కొనుగోలు చేస్తూ రైతులకు లాభాలు రాకుండా వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి కోగిల మహేష్ తీసుకెళ్ళారు. స్పందించిన కలెక్టర్ త్వరలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మొక్కజొన్న పంటను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

## పభుత్వ ఏరియా ఆసుపత్రిలో న్యాయ విజ్ఞాన సదస్సు



**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ములుగు జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ ఏరియా ఆసుపత్రిలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ పాల్గొని మాట్లాడుతూ అనారోగ్య బారిన పడకుండా ప్రతి రోజు కనీసం ఒక గంట పాటు వ్యాయామం చేయాలని, ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించాలని అన్నారు. అలాగే పొగాకు, గుట్కాలు, సిగరెట్లు, మద్యం తీసుకోవడం వలన అనారోగ్యం పాలు అవుతారని, అందరు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. ఉచిత న్యాయ సహాయం గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, సివిల్ సర్జన్ కె నరేష్, ఎం దీపక్, తదితరులు పాల్గొన్నారు.

## నాయి బ్రాహ్మణులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

**ప్రజాపక్షం/ములుగు:** వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీ దేవిపేట గ్రామంలో మంగళవారం నాయి బ్రహ్మణ సేవా సంఘం మండల సమావేశం కురుమళ్ళ సంపత్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా గౌరవ అధ్యక్షులు జంపాల రవీందర్, ముత్యాల రాజులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ మండలంలోని నాయి బ్రహ్మణుల సమస్యలపై అందరూ సంఘటిత కావాల్సిన సమయం వచ్చిందన్నారు. నాయి బ్రహ్మణుల ఐక్య పోరాటాలకు సిద్ధంగా ఉండాలని అన్నారు. మండల కేంద్రాలలో కమ్యూనిటీ హాల్ నిర్మించుకొనుటకై సంఘటితంగా ఉండాలని, అలాగే దేవాలయాలు జాతరలో వృత్తిపై హక్కులు సాధించుకోవాలన్నారు. వృత్తిపై కార్పొరేట్ శక్తుల దాడిని ఎదుర్కొనేందుకు సిద్దంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం మండల కమిటీని గ్రామ కమిటీల సమక్షంలో ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షులుగా కురుమళ్ల సంపత్, ఉపాధ్యక్షులుగా దుబ్బాక ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా మురహరి సంపత్, కోశాధికారిగా చెన్న శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా మొగిలిచర్ల అనిల్, సభ్యులుగా మద్రిపల్లి కిషన్, చెన్న కుమార్, చెన్న భూమయ్య, చెన్న శంకర్, దుబ్బాక క్రాంతి, కురుమళ్ళ భద్రయ్య, దేవరకొండ వేణు, దేవరకొండ సతీష్, పాల్గొన్నారు